కొత్త సంవత్సరం వస్తోందంటే మనందరికీ సంతోషమే. సరదాగా సాగిపోయే పార్టీలు.. నూతన క్యాలెండర్లూ, డైరీలు.. వీటితోపాటుగా మరో ముఖ్యమైన విషయం గురించీ ఆలోచిస్తాం. అవే... కొత్త సంవత్సరపు తీర్మానాలు. కొందరు విద్యార్థులు ఏడాది మొదట్లో హడావుడిగా కొన్ని తీర్మానాలు చేసేసుకుని కొన్ని రోజులపాటు శ్రద్ధాసక్తులతో అమలుచేస్తారు కూడా. ఆ తర్వాత మెల్లగా వాయిదాలు వేయడం మొదలుపెడతారు. ఆపై మొత్తానికే వదిలేస్తారు. అలాకాకుండా ఉండాలంటే...?

తీరు మార్చుకుంటే.. తీర్మానాలు హిట్టే!

ఏ పని చేసినా ఫొటో తీయడం, దాన్ని వాట్సాప్ గ్రూపుల్లోనో, ఇన్‌స్టా, ఫేస్‌బుక్, ఎక్స్‌ల్లోనో అప్‌లోడ్ చేసి ఎన్ని లైకులు వచ్చాయో చూసుకోవడం కొంతమందికి దాదాపు దినచర్యగా మారిపోయింది. ఎక్కువ లైకులు వస్తే ఆనందించడం, తక్కువ వస్తే ఇతరులతో పోల్చుకుని బాధపడిపోవడం చేస్తుంటారు. శుభాకాంక్షల నుంచి ఓదార్పుల వరకూ అన్నింటికీ సోషల్ మీడియానే వేదికైపోయింది. దీని మోజులో పడి అమూల్యమైన కాలమెంతో వృథా అవుతుందనేది మర్చిపోతుంటారు. కాబట్టి సోషల్ మీడియాకు దూరంగా ఉండాలనే తీర్మానం చేసుకోవడం ఎంతో అవసరం.

సోషల్ మీడియా వాడకాన్ని నిర్దిష్ట సమయానికే పరిమితం చేసుకోవాలి. ఇక్కడో విషయాన్ని గుర్తుంచుకోవాలి. చిన్న పిల్లలకైతే పెద్దవాళ్లు తమను గమనిస్తారనే భయం ఉంటుంది. కళాశాల స్థాయికి వచ్చిన తర్వాత మన మంచీ చెడుల గురించి మనమే ఆలోచించుకోవాలి. సమయాన్ని దుర్వినియోగం చేస్తున్నామని తెలిసీ అదే పనిని పదే పదే చేస్తున్నామంటే అర్థం.. మన మీద మనకు నియంత్రణ లేదనే కదా? కాబట్టి ముందుగా మన ఆలోచనల్నీ, చర్యల్నీ అదుపు తప్పకుండా చూసుకోవడం అలవాటు చేసుకోవాలి.

కొన్నిసార్లు బాగా విసుగ్గా ఉండి చదవాలనిపించకపోవచ్చు. కానీ పరీక్షలు దగ్గర్లోనే ఉండొచ్చు. అలాంటప్పుడు అనుకున్న సమయంలోగా చదవడం పూర్తిచేస్తే.. కాసేపు సోషల్ మీడియాలో రిలాక్స్ కావచ్చనే నియమం పెట్టుకోవచ్చు. ఇక్కడ గుర్తుపెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే.. ముందుగా పని పూర్తిచేయాలి. ఆ తర్వాతే వినోదం. ప్రశ్నించేవాళ్లు ఎవరూ లేకపోయినా పెట్టుకున్న నియమాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించకూడదు.

వాయిదాలు వద్దు

ఈరోజు చేయాల్సిన పనిని రేపటికి.. రేపు చేయాల్సిన దాన్ని ఆ తర్వాత ఎప్పటికో వాయిదాలు వేయడం చాలా మందికి అలవాటే. ఈలోగా కాలం మంచులా కరిగిపోయి పరీక్షలూ ముంచుకొస్తాయి. అప్పుడు మేల్కొని కంగారుపడినా ఫలితం ఉండదు. అందుకే ఎప్పటి పనిని అప్పుడే పూర్తిచేయడం అలవాటు చేసుకోవాలి.

అవసరాన్ని బట్టి పనులను ముందుగా విభజించుకోవాలి. ఇప్పుడే ఈ క్షణమే చేయాల్సిన పనులు, నిర్ణీత సమయంలోగా చేయాల్సినవి, మీ తరపున ఎవరైనా చేయగలిగేవీ, అసలు అవసరమే లేని పనులూ కొన్ని ఉంటాయి. ఇలా విభజించుకుని ప్రాముఖ్యాన్ని బట్టి చేస్తూపుంటే ఒత్తిడికి దూరంగా ఉండొచ్చు. అలాగే పనులూ వాయిదా పడకుండా ఉంటాయి.

చదవడానికి కూర్చున్నప్పుడు స్మార్ట్‌ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేయడమే మంచిది. లేకపోతే ఫోన్ చూస్తూ చదవాల్సిన వాటిని వాయిదా వేసే అవకాశం ఉంటుంది.

ఎలాంటి శబ్దాలూ రాని, అవాంతరాలూ లేని ప్రదేశాన్ని ఎంచుకుని చదవాలి. కుటుంబసభ్యుల సంభాషణలు వినిపిస్తే.. చదివేదాన్ని పక్కన పెట్టి మీరూ మాట్లాడటం మొదలుపెడతారు. టీవీ శబ్దం పెద్దగా వినిపించినా మీ ఆలోచనలు దాని చుట్టూ తిరగొచ్చు. దాంతో రాయాల్సినవీ, చదవాల్సినవీ రేపటికి వాయిదా పడొచ్చు.

చదువు విషయంలోనే కాదు, దరఖాస్తులు నింపి.. సమర్పించే విషయంలోనూ గడువు తేదీ వరకూ వాయిదా వేస్తుంటారు కొందరు. చివరి నిమిషంలో నింపేటప్పుడు తప్పులు దొర్లొచ్చు. సర్వర్ పనిచేయక దరఖాస్తు చేయటం కుదరకపోనూవచ్చు. దీనివల్ల ఎంతో మంచి అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉంటుంది కదా? సకాలంలో దరఖాస్తు చేయకపోతే.. ఒక్కోసారి సుదూర ప్రాంతంలోని పరీక్ష కేంద్రాన్ని కేటాయించే ప్రమాదమూ ఉంటుంది.

తొందరపాటు తగదు

ఒకోసారి తీర్మానాల అమలు విఫలం కావడానికి త్వరగా లక్ష్యాన్ని చేరుకోవాలనే ఆరాటం కూడా కారణం కావచ్చు. ఉదాహరణకు బరువు తగ్గాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నారనుకుందాం. ఒకపక్క డైటింగ్ చేస్తూ.. మరోపక్క కఠిన వ్యాయామాలూ మొదలుపెడితే వెంటనే నీరసించిపోతారు. కొద్ది రోజుల తర్వాత నావల్ల కాదనే నిర్ణయానికి వచ్చి లక్ష్యాన్ని మధ్యలోనే వదిలిపెట్టేస్తారు. అలాకాకుండా డైటింగ్‌తోపాటు తేలికపాటి వ్యాయామాలు మొదలుపెట్టాలి. వీటికి అలవాటు పడిన కొంతకాలం తర్వాత కష్టమైన వ్యాయామాలూ చేయొచ్చు.

ఎన్నో లక్ష్యాలు

కొంతమంది ఒకేసారి ఎక్కువ తీర్మానాలు చేసుకుంటారు. మంచి ర్యాంకు సాధించాలి, బరువు తగ్గాలి, రోజూ వ్యాయామం చేయాలి, ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలి, కొత్త కోర్సులు ఆన్‌లైన్లో చేయాలి, నైపుణ్యాలు పెంచుకోవాలి, ఖర్చులు తగ్గించుకుని ఆదాయ మార్గాలు పెంచుకోవాలి.. ఇలా ఒకేసారి అనేక రకాల లక్ష్యాలను నిర్దేశించుకోవడం వల్ల దేనిమీదా ప్రత్యేకంగా దృష్టిని నిలపలేరు. ప్రాధాన్యక్రమంలో వీటిని సాధించే ప్రయత్నాలు చేయాలి.

స్పష్టంగా కనిపించేలా...

ఏ పని చేయాలన్నా దాన్ని ఎలా చేయాలనే దాని గురించి ముందుగా ఆలోచిస్తాం. అంటే ముందుగా మన మనసులోనే కార్యాచరణ పథకాన్ని రచించుకుంటాం కదా. దాన్నే ఇప్పుడు పేపర్ మీద పెట్టండి. అంటే పని పూర్తిచేయడానికి ఒక ప్రణాళిక వేసుకుంటారన్నమాట. దాన్ని ఇంట్లో కంటికి ఎదురుగా స్పష్టంగా కనిపించేలా పెట్టుకుంటే మర్చిపోకుండా ఉంటారు. ఇలా చేయకపోతే ఏ అవాంతరం వచ్చినా లక్ష్యాన్నీ, దాని సాధననూ మర్చిపోవచ్చు.

విఫలమైనవాటి సంగతి?

గత ఏడాది ఒక లక్ష్యాన్ని పెట్టుకుని విఫలమయ్యారు. అది ఆచరణ సాధ్యమైనదైతే.. అదే లక్ష్యాన్ని కొత్త సంవత్సరంలోనూ పెట్టుకోవడం, దాన్ని సాధించటం కోసం కృషి చేయడం తప్పేమీ కాదు. కాకపోతే అమలు చేయడంలో ఏమేం పొరపాట్లు దొర్లాయో పరిశీలించుకుని, వాటిని సవరించుకుంటే సరిపోతుంది.

చివరిగా గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఒకటి ఉంది. 'కొత్త సంవత్సరం వస్తుందీ.. పోతుంది. నా జీవితంలో ఎలాంటి మార్పు ఉండదు..' ఇలా ప్రతికూలంగా ఆలోచిస్తే మాత్రం నిజంగానే ఎలాంటి మార్పూ ఉండదు. ఎందుకంటే ఇప్పటి మన ఆలోచనలే భవిష్యత్తును నిర్ణయిస్తాయి. 'గత ఏడాది తెలియక కొన్ని పొరపాట్లు చేశాను. ఈ సంవత్సరం అలాంటివి మళ్లీ జరగకుండా చూసుకుంటాను. నన్ను నేను సరికొత్తగా ఆవిష్కరించుకుంటాను..' ఇలా సానుకూలంగా ఆలోచిస్తూ.. ఆచరణ కొనసాగిస్తే అనుకున్నది సాధించగలుగుతాం!

వైద్య రంగంలో ఏ కోర్సులు?

దూరవిద్యలో బీఎస్సీ (బీజడ్‌సీ) చేశాను. రెగ్యులర్ విధానంలో ఎమ్మెస్సీ చేయాలనుకుంటున్నాను. వైద్య రంగానికి సంబంధించి కోర్సులు ఏమున్నాయి? - అశోక్

బీఎస్సీ (బీజడ్‌సీ) చదివినవారు వైద్య/ ఆరోగ్య రంగానికి సంబంధించి పీజీలో బయోకెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, మైక్రో బయాలజీ, జెనెటిక్స్, ఫోరెన్సిక్ సైన్స్, బయో ఇన్ఫర్మాటిక్స్, న్యూట్రిషన్, పబ్లిక్ హెల్త్, మాలిక్యులర్ బయాలజీ, లైఫ్ సైన్సెస్, హ్యూమన్ జెనెటిక్స్, బయో థెరప్యూటిక్స్, బయో మాలిక్యులర్ ఫిజిక్స్, జీనోమ్ టెక్నాలజీ, మెడికల్ బయోటెక్నాలజీ, సిస్టమ్స్ బయాలజీ, టిష్యూ సైన్స్ లాంటి కోర్సులు చేయవచ్చు. మీకు మేనేజ్‌మెంట్ రంగంపై ఆసక్తి ఉంటే ఎంబీఏ హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, హెల్త్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ లాంటి కోర్సుల గురించి ఆలోచించవచ్చు. ఇవేకాకుండా అడ్వాన్స్‌డ్ కోర్సులైన స్టెమ్ సెల్ టెక్నాలజీ, ట్రాన్స్‌ప్లేషనల్ ఇమ్యునాలజీ, ట్రాన్స్‌ప్లేషనల్ న్యూరోసైన్స్, క్లినికల్ వైరాలజీ లాంటి కోర్సులు కూడా చదివే అవకాశం ఉంది. మీ ఆసక్తిని బట్టి ఏది చదవాలో నిర్ణయించుకోండి.

– ప్రా. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

తాజా ఇంటర్నషిప్‌లు

విశాఖపట్నం, విజయవాడల్లో

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: ఐకుశల్ స్పేసెస్
స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 29
అర్హతలు: బిజినెస్ అనలిటిక్స్, డిజిటల్, ఈమెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఎస్ఈఓ నైపుణ్యాలు
internshala.com/i/2ae7c9

విశాఖపట్నం, హైదరాబాద్‌ల్లో

మార్కెటింగ్

సంస్థ: స్కైలార్క్ ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్
స్టైపెండ్: నెలకు రూ.8,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 29
అర్హతలు: మార్కెటింగ్, మార్కెట్ అనాలిసిస్ నైపుణ్యాలు internshala.com/i/2ae7c9

హైదరాబాద్‌లో

సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: వాటే వావ్ మార్కెటింగ్
స్టైపెండ్: నెలకు రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 28
అర్హతలు: అడోబ్ ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటంలో నైపుణ్యం internshala.com/i/370dce

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: బ్రిలియంట్ మ్యాడ్‌నెస్
స్టైపెండ్: నెలకు రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 31
అర్హతలు: అడోబ్ క్రియేటివ్ సూట్, ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, కోరల్‌డ్రా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్, వీడియో ఎడిటింగ్ నైపుణ్యాలు
internshala.com/i/9f5c27

మార్కెట్ రిసెర్చ్

సంస్థ: డిజిబ్రోస్ **స్టైపెండ్:** నెలకు రూ.12,000-16,000 **దరఖాస్తు గడువు:** జనవరి 1
అర్హతలు: బిజినెస్ రిసెర్చ్, ఇంగ్లిష్ మాట్లాడటం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-పవర్ పాయింట్, రిసెర్చ్ అండ్ అనలిటిక్స్ నైపుణ్యాలు
internshala.com/i/35b4e1

కొక్కు ప్రాపర్టెక్ సంస్థలో..

1. సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: నెలకు రూ.5,000 **దరఖాస్తు గడువు:** జనవరి 2 **అర్హతలు:** సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు internshala.com/i/d874d1

2. సివిల్ ఇంజినీరింగ్
స్టైపెండ్: నెలకు రూ.2,000 **దరఖాస్తు గడువు:** జనవరి 3 **అర్హతలు:** సివిల్ ఇంజినీరింగ్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
internshala.com/i/098dea

నోడ్.జేఎస్ డెవలప్‌మెంట్

సంస్థ: మెటాపాయింటర్
స్టైపెండ్: నెలకు రూ.15,000-18,000
దరఖాస్తు గడువు: జనవరి 3
అర్హతలు: జావాస్క్రిప్ట్, మాంగోడీబీ, నోడ్.జేఎస్, రెస్ట్ ఏపీఐ, టైప్‌స్క్రిప్ట్ నైపుణ్యాలు
internshala.com/i/5f2014

బీఎం ఇన్నోవేషన్స్

1. డిజిటల్ మార్కెటింగ్
స్టైపెండ్: నెలకు రూ.2,000-5,000
దరఖాస్తు గడువు: జనవరి 2
అర్హతలు: డిజిటల్, ఈమెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మార్కెటింగ్, ఇంగ్లిష్ రాయడం, ఎస్ఈఓ, ఎస్ఈఎం నైపుణ్యాలు
internshala.com/i/1b4167

2. కంటెంట్ రైటింగ్
స్టైపెండ్: నెలకు రూ.2,000-5,000
దరఖాస్తు గడువు: జనవరి 2
అర్హతలు: కంటెంట్ రైటింగ్, క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ రాయడం, రిసెర్చ్ అండ్ అనలిటిక్స్, ఎస్ఈఓ నైపుణ్యాలు
internshala.com/i/0c3f99

3. గ్రాఫిక్ డిజైన్
స్టైపెండ్: నెలకు రూ.2,000-5,000
దరఖాస్తు గడువు: జనవరి 2
అర్హతలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, క్రియేటివ్ సూట్, ఇలస్ట్రేటర్, ఇన్‌డిజైన్, ఫొటోషాప్, ఫొటోషాప్ లైట్‌రూమ్ సీసీ, వీడియో ఎడిటింగ్ నైపుణ్యాలు internshala.com/i/9788c2

4. హ్యూమన్ రిసోర్సెస్
స్టైపెండ్: నెలకు రూ.2,000-5,000
దరఖాస్తు గడువు: జనవరి 2
అర్హతలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-పవర్‌పాయింట్, ఎంఎస్-వర్డ్ నైపుణ్యాలు
internshala.com/i/f8fc88

నోటిఫికేషన్స్

ప్రభుత్వ ఉద్యోగాలు

ప్రాజెక్టు కన్సల్టెంట్‌లు

నోయిడాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ స్మాల్ బిజినెస్ డెవలప్‌మెంట్- ఒప్పంద ప్రాతిపదికన 152 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- సీనియర్ కన్సల్టెంట్: 04
- కన్సల్టెంట్ (గ్రేడ్ 2): 04
- కన్సల్టెంట్ (గ్రేడ్ 1): 08
- కన్సల్టెంట్ (యంగ్ ప్రొఫెషనల్): 16
- ప్రోగ్రాం కోఆర్డినేటర్: 15
- సిస్టమ్ అనలిస్ట్/ డెవలపర్: 5
- ప్రాజెక్టు కన్సల్టెంట్: 100

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీతోపాటు పని అనుభవం.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను డైరెక్టర్, ఎన్ఐఈఎస్‌బీయూడీ, ఎ-23, సెక్టార్-62, ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, నోయిడా చిరునామాకు పంపాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: 09-01-2024. **వెబ్‌సైట్:** https://www.niesbud.nic.in/

డీఎంఐ, పట్నాలో ఫ్యాకల్టీ పోస్టులు

పట్నాలోని డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్- కింది ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
1. అసిస్టెంట్ ప్రొఫెసర్- గ్రేడ్ II
2. అసిస్టెంట్ ప్రొఫెసర్- గ్రేడ్ I
3. అసోసియేట్ ప్రొఫెసర్
4. ప్రొఫెసర్

అర్హతలు: పీజీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31-01-2024. **వెబ్‌సైట్:** https://dmi.ac.in/frs

వాక్-ఇన్స్

పీఎంబీఐలో అసిస్టెంట్ మేనేజర్‌లు

న్యూదిల్లీలోని ఫార్మాస్యూటికల్స్ అండ్ మెడికల్ డివైజెస్ బ్యూరో ఆఫ్ ఇండియా (పీఎంబీఐ) - కింది పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
అసిస్టెంట్ మేనేజర్లు: 2 **వయసు:** 32 సంవత్సరాలు మించకూడదు.
సీనియర్ మార్కెటింగ్ మేనేజర్లు: 2 **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
అర్హత: డిగ్రీ, పీజీడీఎం/ ఎంబీఏ (సేల్స్/ మార్కెటింగ్)తో పాటు పని అనుభవం.
ఇంటర్వ్యూ తేదీలు: 29-12-2023, 05-01-2024.
వెబ్‌సైట్: http://janaushadhi.gov.in/index.aspx

అప్రెంటిస్‌షిప్

ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్‌లో 250 ఖాళీలు

ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్... దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రీజియన్లలోని ఎల్ఐసీహెచ్ఎఫ్ఎల్ శాఖల్లో 250 మంది అప్రెంటిస్‌ల శిక్షణకు ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది. (ఆంధ్రప్రదేశ్‌లో 19, తెలంగాణలో 30 ఖాళీలు)
శిక్షణ వ్యవధి: 12 నెలలు. **అర్హత:** ఏదైనా విభాగంలో డిగ్రీ.
వయసు: 01-12-2023 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
స్టైపెండ్: నెలకు రూ.9,000 - రూ.15,000.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: జనరల్ కేటగిరీ, ఓబీసీలకు రూ.944. ఎస్సీ, ఎస్టీ, మహిళా అభ్యర్థులకు రూ.708. దివ్యాంగ అభ్యర్థులకు రూ.472.
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: 31.12.2023.
పరీక్ష ఫీజు చెల్లింపు చివరి తేదీ: 03-01-2024.
రాత పరీక్ష తేదీ: 06-01-2024. **డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ తేదీలు:** 09-01-2024 నుంచి 11-01-2024 వరకు.
అప్రెంటిస్ శిక్షణ ప్రారంభం: 15-01-2024.
వెబ్‌సైట్: https://www.lichousing.com/job opportunities

ఎండీఎస్ఎల్, ముంబయిలో..

ముంబయిలోని మాజ్‌గావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ కింది విభాగాల్లో డిప్లొమా/గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
- డిప్లొమా అప్రెంటిస్‌లు: 30
- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు: 170

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ.
వయసు: 01-01-2024 నాటికి 18 నుంచి 27 సంవత్సరాల మధ్య ఉండాలి.
స్టైపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.9000; డిప్లొమా అప్రెంటిస్‌లకు రూ.8000. **ఎంపిక:** విద్యార్హత మార్కులు, ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 11-01-2024.
ఇంటర్వ్యూలు ప్రారంభం: 30-01-2024.
వెబ్‌సైట్: https://www.mazagondock.in/

చలో.. నైపుణ్యాల బాటలో!

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) ఉద్యోగం.. ఎంతోమంది విద్యార్థుల కల. దీన్ని నూతన సంవత్సరంలో సాకారం చేసుకోవాలనుకోవడం అభినందనీయమైన మంచి సంకల్పం. ఇందుకు కావాల్సిన కొన్ని నైపుణ్యాల గురించి ఇప్పటికే తెలుసుకున్నాం కదా! మరికొన్ని అంశాలూ ఉన్నాయి. అవేమిటో చూద్దాం!

బ్లాక్ చెయిన్: సమాచారాన్ని బ్లాక్స్‌గా విడివిడిగా నిక్షిప్తం చేస్తూ ఎటువంటి సైబర్ దాడులకూ, డేటా చౌర్యానికీ అవకాశం లేకుండా చేస్తుంది బ్లాక్ చెయిన్ టెక్నాలజీ. పూర్తిస్థాయి రక్షణ కల్పించేలా అత్యున్నత సాంకేతికత పరిజ్ఞానమిది. పబ్లిక్, ప్రైవేట్, పర్మిషన్డ్, కన్సార్టియమ్ బ్లాక్ చెయిన్స్‌గా సృష్టించి దీన్ని అవసరానికి తగిన విధంగా ఉపయోగించుకోవచ్చు. సప్లై చెయిన్, హెల్త్‌కేర్, రిటైల్, మీడియా అండ్ అడ్వర్టైజింగ్, టెలి కమ్యూనికేషన్స్, ట్రావెల్ తదితర రంగాల్లో దీన్ని విరివిగా ఉపయోగిస్తున్నారు. ప్రధానంగా ఈ టెక్నాలజీ వినియోగం బిజినెస్ మేనేజ్‌మెంట్ రంగంలో అధికం. గత కొంతకాలంగా మంచి ఆదరణ పొందుతున్న ఈ టెక్నాలజీని నేర్చుకోవడం ద్వారా సంబంధిత రంగాల్లో అవకాశాలు పొందవచ్చు.

మేనేజ్‌మెంట్: బృంద సభ్యులను, ప్రాజెక్టును, పనిని.. దేన్నయినా సరే సమర్థంగా నిర్వహించగలిగే మెలకువలు నేర్చుకోవడం నేటి ఉద్యోగార్థులకు చాలా అవసరం. అధిక పనీ, ఒత్తిడీ ఉండే ఐటీ లాంటి రంగాల్లో నిర్వహణ నైపుణ్యాలున్న ఉద్యోగులకు ఎల్లప్పుడూ గిరాకీ ఉంటుంది. విభిన్న మనస్తత్వాలుండే వ్యక్తులతో మాట్లాడటం, సమస్యలను పరిష్కరించడం, పరిస్థితులను చక్కదిద్దడం, పని సజావుగా పూర్తయ్యేలా చూడటం, మొత్తంగా లక్ష్యాన్ని చేరుకునేలా నడిపించడం లాంటి మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు పెంచుకుంటే.. ఆ అభ్యర్థులను కంపెనీలూ వదులుకోవు. అందువల్ల అభ్యర్థులు దృష్టి పెట్టాల్సిన మరో ముఖ్యమైన అంశం.. నిర్వహణ. ఇందులో ప్రత్యేకంగా ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ గురించి కూడా నేర్చుకోవచ్చు.

క్రిటికల్ థింకింగ్: ఈ ఆలోచనాధోరణిలో ఉండే అంశాలేమిటంటే.. ఏ విషయాన్ని అయినా లోతుగా పరిశీలించి, అన్ని కోణాల్లోనూ విశ్లేషించటం, ఉన్న సమాచారాన్ని అర్థం చేసుకుని, పరిస్థితులను దృష్టిలో ఉంచుకోవటం, స్థిరంగా ఆలోచించి అన్నివిధాలా ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవటం. ప్రస్తుతం ఉద్యోగం ఆశించే అభ్యర్థులు తప్పకుండా నేర్చుకోవాల్సిన అంశాల్లో ఇదీ ఒకటి. ప్రాబ్లమ్ సాల్వింగ్‌కు అవసరమైన సృజనాత్మక విధానాలను ఇది సూచించగలదు. ముఖ్యంగా నాయకత్వం వహించే స్థానాలకు ఎదగాలని ఆశపడేవారికి ఇది తప్పక ఉండాల్సిన నైపుణ్యం. డేటా, టెక్నాలజీ, బిజినెస్ ప్రాసెస్, వ్యక్తులు.. అనే నాలుగు అంశాల ఆధారంగా ఆలోచనలను ఏ విధంగా అమలు చేయాలో క్రిటికల్ థింకింగ్ చెబుతుంది. నిర్ణీత సమయం కేటాయిస్తూ నిరంతరం సాధన చేయడం ద్వారా దీనిలో మెలకువలు నేర్చుకోవచ్చు.

యూజర్ ఎక్స్‌పీరియన్స్: ఒక ప్రొడక్ట్, సిస్టమ్ లేదా సర్వీస్‌తో వినియోగదారునికి ఎటువంటి అనుభూతి కలుగుతోంది అనే విషయాన్ని అర్థం చేసుకుని మెరుగైన యూజర్ ఎక్స్‌పీరియన్స్ కలిగేలా చేసే నిపుణులే వీరు. తమ నైపుణ్యాన్ని ఉపయోగించి వినియోగదారునికి ఎక్కడా ఎటువంటి ఇబ్బందీ రాకుండా, పని చివరివరకూ మెరుగైన విధంగా జరిగేలా జాగ్రత్త వహిస్తారు. యూఎక్స్ డిజైన్ ముఖ్యమైన మార్కెటింగ్ అవసరాలను టార్గెట్ చేస్తుంది. యూజర్ ఎలా భావిస్తారనే విషయాన్ని ముందుగానే గుర్తించి తగిన విధంగా చర్యలు తీసుకునేందుకు దోహదపడుతుంది. ప్రాథమిక స్థాయి ఉద్యోగాలు సులభంగా చేజిక్కించుకోవాలి అనుకున్నప్పుడు అభ్యర్థులకు ఇది బాగా ఉపయోగపడే నైపుణ్యం.

డేటా సైన్స్: మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, స్పెషలైజ్డ్ ప్రోగ్రామింగ్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ లాంటివి ఉపయోగిస్తూ ఆర్గనైజేషనల్ డేటా నుంచి ఇన్‌సైట్స్ తీసుకునేందుకు డేటా సైన్స్ ఉపయోగపడుతుంది. డేటాను పూర్తిస్థాయిలో సాంకేతికంగా డీల్ చేయడంలో ఇది ముఖ్యపాత్ర పోషిస్తుంది. ఇటువంటి డేటా ఇన్‌సైట్స్.. డెసిషన్ మేకింగ్, స్ట్రాటజిక్ ప్లానింగ్‌లో ఎంతగానో ఉపయోగపడతాయి. డేటాను ఉపయోగించుకుని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడం కోసం సంస్థలు దీనిపై ఆధారపడుతున్నాయి. ముఖ్యమైన సాంకేతిక ఉద్యోగాలు సాధించాలి అనుకునేవారు దీన్ని తప్పకుండా నేర్చుకోవాలి. ప్రాచుర్యం పొందిన ప్రొఫెషనల్ కోర్సులు నేర్చుకుంటే ఉద్యోగ మార్కెట్‌లో నిలదొక్కుకోవచ్చు.

కొత్త ఏడాది కొడదాం ఐటీ కొలువు-2

అందుకునేది ఎలా?

నెట్‌వర్కింగ్: పరిచయాలు పెంచుకోవడం.. మంచి అవకాశాలు అందుకోవడానికి నాంది. కొత్తగా కెరియర్‌ను మొదలుపెట్టినప్పుడు నెట్‌వర్కింగ్ ఎంత ఎక్కువగా చేస్తే అంతగా మనం ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నామనే విషయం అందరికీ తెలుస్తుంది. ఎక్కువ సోర్స్ ఉన్నప్పుడు అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి మార్గం సుగమం అవుతుంది. అలాగే ఇప్పటికే కంపెనీల్లో పనిచేస్తున్నవారి ద్వారా రిఫరెన్స్ వచ్చినప్పుడు సంస్థలు ఉద్యోగాల్లోకి తీసుకోవడానికి ఎక్కువ ఆసక్తి చూపిస్తాయి. చాలా ఉద్యోగాలు లోలోపలే బయటకు చెప్పాల్సిన అవసరం లేకుండానే రిక్రూట్ చేస్తుంటారు. అందువల్ల సరైన వ్యక్తులతో పరిచయాలు ఎన్నడూ ఉపకరిస్తాయి. వీలైనన్ని ఎక్కువ నెట్‌వర్కింగ్ ఈవెంట్లకు హాజరుకావడం ద్వారా కూడా దీన్ని సాధించవచ్చు.

కంపెనీలతో నేరుగా సంప్రదింపులు: చాలా కంపెనీలకు ఇప్పుడు అధికారిక వెబ్‌సైట్లు ఉన్నాయి, వాటిని తరచూ అనుసరిస్తూ ఉండటం వల్ల ఎప్పుడైనా నియామకాలు జరుగుతుంటే తెలుస్తుంది. వారికి ప్రొఫైల్‌ను ఇవ్వడం ద్వారా తక్షణ నియామకం లేకపోయినా త్వరలో ఉంటుందనుకున్నప్పుడు సంప్రదిస్తారు. ఏ కంపెనీల్లో ఖాళీలు ఉన్నాయి, వాటినెలా సంప్రదించవచ్చు అనేది ఒకచోట రాసుకోవడం, ప్రతి కంపెనీకి దరఖాస్తు చేసేటప్పుడు విడివిడిగా కవర్ లెటర్స్ రాయడం, అందులో మీరు ఏవిధంగా వారికి సరైన ఎంపికనో చెప్పేందుకు ప్రయత్నించడం.. ఇలాంటి వాటి ద్వారా రిక్రూటర్ల దృష్టిని ఆకర్షించవచ్చు.

జాబ్ సెర్చ్ వేదికల వినియోగం: ఒకేసారి ఎక్కువ ఉద్యోగాల గురించి సమాచారం తెలుసుకోవాలన్నా, దరఖాస్తు చేయాలి అనుకున్నా జాబ్ సెర్చ్ వేదికలను ఉపయోగించుకోవడం మంచిది. వీటిలో లొకేషన్, జీతభత్యాలు, ఇతర కీవర్డ్స్ ఆధారంగా ఉద్యోగాలను వెతకడం కుదురుతుంది. తద్వారా ఎక్కువ సమాచారం మనవద్ద ఉంటుంది.

జాబ్ ఫేర్‌లకు వెళ్లడం: దగ్గర్లో జరిగే జాబ్ ఫేర్‌లకు హా